క్లుప్తంగా

సినీఫక్కీలో రూ.1 లక్ష చోరీ

మార్టూరు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి నుంచి గుర్తు తెలియని మరో యువకుడు బైకుపై వెంబడించి సినీ ఫక్కీలో రూ.1 లక్ష కాజేసిన ఘటన శనివారం మార్టూరులో జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. జొన్నతాళి గ్రామానికి చెందిన ఇండేల శ్రీనివాసరెడ్డికి ఆయన కుటుంబ అవసరాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన కొండపల్లి ఏడుకొండలు స్థానిక నాగరాజుపల్లి సెంటర్లో రూ.1 లక్ష నగదు ఇచ్చాడు. నగదును తన టీవీఎస్ మోపెడ్ ముందున్న కవర్లో పెట్టుకొని సర్వీసు రోడ్డులో జొన్నతాళికి బయలుదేరాడు. శ్రీనివాసరెడ్డిని గ్లామర్ బైక్‌పై వెంబడిస్తూ వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి హీరో షోరూం సమీపంలో ఆపి మీ జేబులో నుంచి చిల్లర నోట్లు రోడ్డుపై పడ్డాయి చూసుకో అని చెప్పాడు. తన వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెనుక రోడ్డుపై పడి ఉన్న చిల్లర నోట్లను శ్రీనివాసరెడ్డి ఏరుకుంటున్నాడు. ఈక్రమంలో బైకుపై వచ్చిన అగంతకుడు టీవీఎస్ కవర్లో ఉన్న లక్ష రూపాయల నగదును తస్కరించి నాగరాజుపల్లి సెంటర్ వైపు బైకుపై పారిపోయాడు. నిందితుడు తనే చిల్లర నోట్లు రోడ్డుపై వేసి తనను మోసగించాడు అనే విషయం తెలుసుకున్న శ్రీనివాసరెడ్డి తేరుకొని నిందితుడి కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

బాల, బాలికల మధ్య లింగవివక్షత తగదు

పర్చూరు (చినగంజాం): విద్యాలయాలలో బాల, బాలికల మధ్య లింగ వివక్షత తగదని పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కే ప్రశాంతి అన్నారు. ఉప్పుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కే ప్రశాంతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆడపిల్లలు, మగ పిల్లలు మధ్య లింగ వివక్ష చూపకూడదని, ఇద్దరినీ సమానంగా పరిగణించాలని తెలియజేశారు. బేటీ బచావో, బేటీ పడావో అని నినాదం ఇచ్చారు. ఆడపిల్లలు ఇంటి పనికి, మగ పిల్లలు స్కూలుకు అని అనుకునే కొంత మంది తల్లిదండ్రులు ధోరణి మార్చుకోవాలన్నారు. మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటవేయాలని తెలియజేశారు. పర్చూరు అడ్వకేట్ సీహెచ్ శ్రీరమణి మాట్లాడుతూ బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లోని తేడాలను తెలుసుకోవాలన్నారు.అనంతరం గ్రామంలోని బాలికల సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాన్ని సందర్శించి అక్కడి వసతులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే వసుంధరా దేవి, హాస్టల్ వార్డెన్ అనంత లక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో వసతుల పరిశీలన

బల్లికురవ: ఓటర్లు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎం సుభద్ర కోరారు. శనివారం కొప్పరపాడు గ్రామంలోని 104,105,106 పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తామని చెప్పారు. ఈ ఎం వీర్‌వో వై శ్రీనివాసరావు, సర్వేయర్ చంద్ర, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్




నృత్యం చేస్తున్న చిన్నారులు

బల్లికురవ: పదోతరగతి ఫలితాలు విద్యార్థి దశలో అత్యంత కీలకమని పరీక్షలకు 25 రోజుల మాత్రమే సమయం ఉందని లక్ష్యంతో కష్టపడటంతోపాటు ఇష్టపడి చదవాలని బల్లికురవ ఉన్నత పాఠశాల హెచ్‌యం కె. హనుమంతరావు కోరారు. శనివారం పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు 9 వతరగతి విద్యార్థులు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. పరీక్షల భయం వీడి మంచి ఫలితాలతో పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తేవాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కోరారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఇంటి హక్కులు.. జీవితాలకు వెలుగులు

- పేదలు ఇక సొంతింటిపై పూర్తి హక్కుదారులు
- వేగవంతంగా జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- నియోజకవర్గంలో 1,440 మంది లబ్ధిదారులకు ప్రయోజనం



వేటపాలెంలో జగనన్న మోడల్ కాలనీలో ఇళ్లు



రిజిస్ట్రేషన్‌ల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

వేటపాలెం: నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగుల రత్నాలుగా వెలుగొందాయి. ఇవే కాకుండా మరికొన్ని హామీలతో బడుగు, బలహీన వర్గాలల్లో ఆర్థిక పరిస్థితిని ఒక మెట్టు పైకి ఎక్కించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ఈ ఐదేళ్ల కాలంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటిలో లబ్ధిదారులు లేరంటే అతిశయోక్తికాదు. ఇందులో భాగంగా ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం ఇప్పించి కట్టించిన ఘనత ఒక సీఎం జగన్‌కే దక్కింది. నవర్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం లబ్ధిదారుల్లో సంతోషాన్ని నింపుతోంది. చీరాల నియోజవర్గంలో దాదాపు 1,440 లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. చీరాల నియోజవర్గ పరిధిలోని చీరాల టౌన్, రూరల్ మండలం, వేటపాలెం మండలాల పరిధిలో 75 ఏకరాల స్థలాన్ని సేకరించి 12 లేఅవుట్‌లు వేసి లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. స్థలాల కొనుగోలు, చదును ప్రక్రియ, మౌలిక వసతులు కల్పనకు కోట్లు చేసి పక్కా ఇళ్లు కట్టించారు. ఇప్పటికే వాటిని పేదలకు పంపిణీ చేశారు. ఇంత విలువైన స్థలాలకు గతంలో ఉండే నిబంధనల ప్రకారం లబ్ధిదారులు కేవలం అనుభవించే హక్కు మాత్రమే ఉండేది. ఇప్పుడు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు బదలాయించి పక్కా రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొన్నేళ్ల తరువాత ఆ స్థలంపై పూర్తి హక్కు లభిస్తుంది.

వీఆర్వోలు, సెక్రటరీలచే రిజిస్ట్రేషన్..

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయా గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు ప్రభుత్వం తరఫున పూర్తి చేసి లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయాలన్న సీఎం జగన్ నిర్ణయంతో లక్షలాది మంది పేద ప్రజలకు ప్రయోజనం చేకూరనున్నది. భవిష్యత్‌లో కుటుంబ అవసరాల కోసం స్థలాన్ని తాకట్టు పెట్టాలన్నా, వారసులకు బదలాయించు కోవాలన్నా, వేరొకరికి బదిలీ చేయించే హక్కు కూడా ఈ రిజిస్ట్రేషన్ వల్ల కలుగుతుంది.

నియోజకవర్గంలో..

–చీరాల టౌన్, రూరల్ పరిధిలో మొత్తం 697 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటివరకు 548కి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

–వేటపాలెం మండల పరిధిలో 743 మంది లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 360 మందికి రిజిస్ట్రేషన్‌లు పూర్తిచేశారు.

–మరో రెండు రోజుల్లో లబ్ధిదారులందరికి రిజిస్ట్రేషన్‌లు పూర్తిచేసి వారికి వారి ఇంటిపై పూర్తి హక్కులు చేకూర్చనున్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తిచేయాలి

చీరాల టౌన్: ఇంటి పట్టా, ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం.శోభారాణి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఈపురుపాలెం, తోటవారిపాలెం, కొత్తపాలెం గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న 'జగనన్న పేదలందరికి ఇళ్లు' రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సొంతింటిని అందించడంతో పాటుగా రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్లు అందించడం చారిత్రాత్మకమన్నారు. మండలంలోని పదిహేను గ్రామ పంచాయతీల్లో 697 మందికి ఇంటిస్థలం ఇవ్వడంతో పాటుగా ఇంటి నిర్మాణానికి చేయూతనందించారన్నారు. వీటిలో 570 లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయించామన్నారు. మిగిలిన వారికి త్వరగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీడీవో వెంట పంచాయితీల సెక్రటరీలు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

వేగంగా రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేస్తున్నాం..



నవరత్రాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇచ్చిన స్థలాలను రిజిస్ట్రేషన్ వేగవంతంగా చేయిస్తున్నాం. ఇప్పటివరకు 60 శాతం పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి సచివాలయాల ద్వారా వీఆర్వోలు, సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చాం. ఆయా సచివాలయాల పరిధిలో లబ్ధిదారులు అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలి.

– ప్రసన్న, డిప్యూటీ తహశీల్దార్, వేటపాలెం

ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన యడం బాలాజీ



ఎమ్మెల్యే బాలినేనితో మాట్లాడుతున్న సమన్వయకర్త బాలాజీ



ఎంపీ నందిగం సురేష్‌ను కలిసిన సమన్వయకర్త బాలాజీ, నాయకులు

చీరాల: పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త యడం బాలాజీ శనివారం ఒంగోలులో మాజీమంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ పటిష్టతకు, పర్చూరు ఎమ్మెల్యేగా గెలుస్తానని బాలాజీ బాలినేనికి వివరించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన పలు అంశాలపై బాలినేని సూచనలు చేశారు. అలానే బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను ఉద్దండరాయునిపాలెంలోని ఎంపీ నివాసంలో బాలాజీ మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతల స్వీకరణకు హాజరుకావాలని ఎంపీని బాలాజీ కోరారు. బాలాజీ వెంట నియోజకవర్గ ముఖ్య నాయకులు ఉన్నారు.

అన్నదాతల సంక్షేమం కోసం గ్రామం దత్తత



మాట్లాడుతున్న బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రతినిధులు

చీరాల టౌన్: వ్యవసాయం చేసే అన్నదాతల సంక్షేమం, నూతన వంగడాల తయారీ, గ్రామాభివృద్ధి కోసమే గ్రామాన్ని దత్తత తీసుకున్నామని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని కావూరివారిపాలెం గ్రామ పంచాయతీ దత్తత గ్రామం ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారులు, గ్రామస్తుల సమక్షంలో కావూరివారిపాలెం గ్రామాన్ని బాపట్ల వ్యవసాయ కళాశాల దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా కళాశాల డీన్ మాట్లాడుతూ 2026 వరకు గ్రామాన్ని వ్యవసాయ కళాశాల గ్రామాన్ని దత్తత తీసుకున్నామని చెప్పారు. దీని వలన గ్రామంలోని రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యనివ్వడంతో పాటుగా సామాజిక అవసరాలు, మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. దత్తత గ్రామాభివృద్ధికి, గ్రామంలో రైతులకు పంటల సాగులో మెళుకువలు నేర్పించి అధిక దిగుబడులు సాధించేలా తర్ఫీదును అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఏవో ఐ.సుమతీ, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి, కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, విస్తరణ విభాగాధిపతి ఎం.రమాదేవి, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

28న మాదిగ, ఉపకులాల ఆత్మీయ సభ

అద్దంకి రూరల్: ఈనెల 28న అంబేడ్కర్ భవనంలో మధ్యాహ్నం 3 గంటలకు మాదిగ, ఉపకులాల ఆత్మీయసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ చిరంజీవి మాదిగ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య పాల్గొంటారని తెలిపారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి



చందలూరు గ్రామంలో గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న సమన్వయకర్త హనిమిరెడ్డి

- నియోజవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాయని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చందలూరు గ్రామంలో 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి' కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముందుగా చందలూరు గ్రామంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, స్వతంత్ర సమర యోధుడు సుభాష్ చంద్రబోస్, వంగవీటి రంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని.. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేశామని తెలిపారు. జగనన్నకు అండగా నిలబడి మమ్మల్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఏ సమస్యలు ఉన్నా చెప్పండి.. సమస్యలను తీరుస్తామని భరోసానిస్తూ కార్యక్రమం ముందుకు సాగింది. రాష్ట్రంలో ఒక్క జగనన్నను ఓడించేందుకు పార్టీలన్నీ ఏకమౌతున్నాయన్నారు. ప్రజల అండదండలు ఉన్నంత వరకు రాష్ట్రంలో జగనన్నను ఎవరూ ఏమి చేయలేరన్నారు.

వెన్నుపోటు దొంగలకు బుద్ధి చెప్తాం..

పార్టీని మోసం చేసి వెళ్లి.. వెన్నుపోటు పొడిచిన దొంగలకు ప్రజలు బుద్ధి చెప్తారని హనిమిరెడ్డి అన్నారు. నిన్నమొన్నటి వరకు ఒకరు అంటే మరొకరికి పడదు. అలాంటిది నేడు ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నారన్నారు. ప్రత్యర్థులు ఎన్ని కుయుక్తులు పన్నినా, నియోజకవర్గ ప్రజలు నాకు అండగా ఉన్నారన్నారు. రానున్న సార్వత్రి ఎన్నికలలో వైఎస్సార్ పార్టీ జెండా ఎగరవేసి, నియోజకవర్గం జగనన్నకు గిఫ్ట్‌గా ఇస్తానన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, చందలూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ముళ్లూరి వెంకటేశ్వర్లు (బైరు), సొసైటీ అధ్యక్షుడు పెంట్యాల వీరాంజినేయులు, కసుకుర్తి కనక చంద్రరావు, తమ్మల్లూరి పెద్దకోటయ్య, దుద్దుకూరి అప్పలరాజు, కొప్పోలు రంగారావు, నార్నే రాకేష్, మనమల సుధాకర్, సుబ్బు, రాంబాబు, వెంకటేశ్వర్లు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుల్లెట్‌ను ఢీకొన్న కారు



రోడ్డుపై పడిఉన్న బుల్లెట్ బండి

మేదరమెట్ల: బుల్లెట్‌ను కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి రక్తగాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. హైవే పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని పీ.గుడిపాడు గ్రామానికి చెందిన కొట్టే పూర్ణచంద్రరావు బుల్లెట్‌పై మేదరమెట్ల వైపు నుంచి పీ.గుడిపాడు వెళ్తున్నాడు. పీ.గుడిపాడు సమీపానికి రాగానే రోడ్డు క్రాస్ చేసి గ్రామంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా విజయవాడ వైపు నుంచి వస్తున్న కారు బుల్లెట్‌ను ఢీకొంది. దీంతో బుల్లెట్‌పై ఉన్న పూర్ణచంద్రరావు రోడ్డుపై పడటంతో తలకు, చేతికి, బుజంపై రక్త గాయాలు కాగా 108 వాహనంలో ఒంగోలు సంఘమిత్ర ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



మందులు అందజేస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక భవానిసెంటర్‌లోని మసీదు పక్కన శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హస్పిటల్ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని హనిమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరీక్ష అనంతరం రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణమూర్తి, మండల పార్టీ కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, కౌన్సిలర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరులకు లైసెన్సులు పునరుద్ధరించాలి..

దస్తావేజు లేఖరులకు లైసెన్స్‌లు పునరుద్ధరించాలని, కొత్త లైసెన్స్‌లు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరుతూ శనివారం చిన హనిమిరెడ్డికి అద్దంకి పట్టణ దస్తావేజు లేఖరులు వినతి పత్రాన్ని అందజేశారు. సమస్యలను సంబంధిత శాఖకు తెలియపరుస్తానని హనిమిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్‌లు, డీటీపీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయలోక్ అదాలత్

చీరాల రూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. శనివారం స్థానిక కోర్టు భవన సముదాయం వద్ద నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మార్చి 9వ తేదీన కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. లోక్‌అదాలత్‌లో రాజీలు పడదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులను ఇరుపక్షాలకు చెందిన కక్షిదారుల సమక్షంలో రాజీమార్గంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. కోర్టులలో ఉన్న పెండింగ్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకుంటే సమయంతో పాటు డబ్బును ఆదా చేసుకోవచ్చునని చెప్పారు. లోక్ అదాలత్‌లలో న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు అంతిమ తీర్పులని వాటిపై ఇతర కోర్టులకు అప్పీలు చేసుకునే అవకాశంలేదన్నారు. అంతేకాక లోక్ అదాలత్‌లలో రాజీ చేసుకున్న కేసులలో గతంలో కోర్టుకు చెల్లించిన కోర్టు ఫీజులు కూడా తిరిగి కక్షిదారులకు అందజేస్తామని న్యాయమూర్తి తెలిపారు.

అద్దంకి రూరల్: స్థానిక కోర్టు భవనాల సముదాయం నందు మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి బీ.బాబు నాయక్ శనివారం తెలిపారు.

రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం



ప్రకాశం జట్టుతో తలపడుతున్న కృష్ణా జిల్లా జట్టు

వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ప్రారంభించారు. ముందుగా ఏర్పాటు చేసిన సమావేశంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ప్రకాశం, కృష్ణా, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లా నుంచి మహిళా జట్లు పాల్గొంటాయని తెలిపారు. పోటీలను స్నేహపూర్వక వాతవరణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభ పోటీల్లో ఫ్రెండ్లీ మాచ్‌గా ప్రకాశం జట్టుతో కృష్ణా జిల్లా మహిళలు తలపడ్డారు. కార్యక్రమంలో సీఈసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పీ వెంకటేశ్వర్లు, తమంచి శ్రీనివాసరావు, పూర్వవిద్యార్థి పోలకం శేఖర్, పి ఆంజిబాబు, జీ శ్రీనివాసరావు, హెచ్‌ఎం వెంకటేశ్వరావు, వీ భాస్కర్, పి రమేష్, ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ పునః ప్రతిష్ట

యద్దనపూడి: మండలంలోని పోలూరు గ్రామంలో వేంచేసి ఉన్న భూ, నీళా సమేత చెన్నకేశవస్వామివారి ఆలయంలో జీవ ధ్వజస్తంభ పునః ప్రతిష్ట మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగురోజుల పాటు జరిగే ఈ ప్రతిష్టాపన పూజల్లో భాగంగా తొలిరోజు గణపతిపూజ, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వాస్తుపూజ, ధ్వజ శుద్ద్యర్థం, వాస్తుహోమం, అంగహోమం, ధ్వజకలశ పూజలు, విశేషహోమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. నాలుగు రోజుల పూజల అనంతరం రేపు సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు పరుచూరి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ప్రతిష్ట కార్యక్రమాలను ప్రతిష్టాచార్యుడు బృందావనం ఆదిత్య ఆధ్వర్యంలో హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిష్ట రోజు పరిసర గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో అర్చకులు చలపతాచార్యులు, ఫణీంద్ర, ఆంజనేయశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



శిఖర కలశాన్ని తీసుకువస్తున్న వీరగంధం నారాయణ, అన్నపూర్ణ దంపతులు